క్లుప్తంగా

ముగిసిన బంగారమ్మ ఉత్సవాలు

పద్మనాభం: మండలంలోని తునివలసలో మూడు రోజుల నుంచి జరుగుతున్న బంగారమ్మ ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. సోమవారం తొలేళ్లలో భాగంగా రథాలు ఊరేగించారు. మంగళవారం అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరేగించారు. బుధవారం ముగింపు ఉత్సవం నిర్వహించారు. పరిసర ప్రాంతాలైన రెడ్డిపల్లి, మద్ది, కృష్ణాపురం, పొట్నూరు, విజయానందపురం, అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సుత్తమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చిప్పాడ సుత్తమ్మతల్లి

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లిని బుధవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా అలంకరించారు. పట్టుచీర, పూలమాలలు, గజమాలలతో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. భీమిలి, భోగాపురం మండలాల నుంచి విశేషంగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

భోజనం ప్యాకెట్లు పంపిణీ



భోజనం ప్యాకెట్లు అందిస్తున్న ప్రభాకర్

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోన్‌లోని కాపులుప్పాడ డంపింగ్‌యార్డుతోపాటు మధురవాడ, మారికవలస, కొమ్మాది జంక్షన్ పరిసర ప్రాంతాల్లో సత్యసాయి సేవా సమితి భక్తులు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. పీఎం పాలెం దేవాలయం కన్వీనర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో సాయి భక్తులు 300 మందికి భోజనం, వాటర్ బాటిళ్లు అందజేశారు.

విష్ణుమూర్తి బాధ్యతల స్వీకరణ



భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విష్ణుమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పని చేసిన డాక్టర్ మంజుల విశాఖ ప్రభుత్వ మహిళ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఇదే కళాశాలలో కామర్స్ అధ్యాపకునిగా పనిచేస్తున్న విష్ణుమూర్తిని ప్రిన్సిపాల్‌గా నియమించారు.

సీఐఎస్ఎఫ్ బలగాల ఫ్లాగ్ మార్చ్



తునివలసలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు

పద్మనాభం : ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐఎస్ఎఫ్ బలగాలు మండలంలోని నాలుగు గ్రామాల్లో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. తునివలస, రెడ్డిపల్లి, కొయ్యపేట, చిన్నాపురం గ్రామాల్లో మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ సీహెచ్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- సమస్యాత్మక ప్రాంతాలు, కేంద్రాలపై నిరంతర నిఘా
- ఎన్నికల నిర్వహణ అధికారి భాస్కరరెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ



భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే భీమిలి పెద్ద నియోజకవర్గం కావడంతో ఓటర్ల జాబితా విషయంలో తప్పులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ ఖచ్చితంగా అమలు జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలపై అప్రమత్తంగా ఉంటున్నామని తెలిపారు. అనుమతులు కావాలంటే 48 గంటల ముందు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీ విజిల్ యాప్ ద్వారా ఎవరైనా ధైర్యంగా ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. కేంద్రాల్లో ఏర్పాట్లను బూత్ లెవెల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని... ఈవీఎంలు మొరాయించకుండా, పోలింగ్ సమయంలో ఇతర సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణతోపాటు పలు అంశాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

ఇంటి వద్దే ఓటేసే అవకాశం

పోలింగ్ కేంద్రాలకు రాలేని వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సదుపాయం ఎన్నికల కమిషన్ కల్పిస్తోంది. నడవలేని వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇందుకోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి అవకాశం కల్పిస్తారు.

సీ విజిల్ యాప్‌తో ఫిర్యాదులు

రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. దీని ద్వారా వచ్చే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. ఫిర్యాదు అందిన వెంటనే జాప్యం చేయకుండా ఆయా ప్రాంతాలకు సిబ్బంది చేరుకుని చర్యలు తీసుకుంటారు. ముఖ్యంగా ఫిర్యాదు చేసేవారి పేర్లు, వివరాలు ఎంతో గోప్యంగా ఉంచుతాం. అందువల్ల ఎవరైనా ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు.

సమస్యాత్మక కేంద్రాలపై నిఘా

భీమిలి నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల విషయంలో మరింత జాగ్రత్తతో వ్యవహరిస్తున్నాం. నిరంతర నిఘా ఏర్పాటు చేసున్నాం. ఈ ప్రాంతాల్లో వీడియోల చిత్రీకరణతోపాటు పోలీసుల బందోబస్తు కూడా ఎక్కువ మందితో నిర్వహించనున్నాం.

పక్కాగా కోడ్ అమలు

కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పక్కాగా అమలు చేస్తున్నాం. అన్ని ప్రాంతాల్లోని రాజకీయ పార్టీల బ్యానర్లు తొలగించాం. శిలాఫలకాలు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగాం. కోడ్ నిబంధనలు రాజకీయ పార్టీలతోపాటు ప్రతి ఒక్కరూ పాటించాలి. ప్రభుత్వ ఆస్తులపై జెండాలు కట్టకూడదు. ప్రైవేటు ఆస్తులపై కట్టాలంటే వాటి యజమానుల నుంచి అనుమతి తీసుకోవాలి. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే తక్షణమే చర్యలు తీసుకుంటాం.

అందుబాటులో కాల్ సెంటర్

ఏదైనా ఫిర్యాదులు, సమాచారం కోసం భీమిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఏదైనా సమస్య వుంటే 08933 293451కు కాల్ చేయవచ్చు. అక్కడి సిబ్బంది నమోదు చేసుకుని మా దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ఇదీ నియోజకవర్గ స్వరూపం

ఓటర్లు	3,57,055
పురుషులు	1,75,136
స్త్రీలు	1,81,904
ఇతరులు	15
పోలింగ్ కేంద్రాలు	348

అనుమతులు తప్పనిసరి

ప్రచారానికి సంబంధించి పార్టీల కార్యాలయాల ఏర్పాటు, వాహనాలు, సభల నిర్వహణ, ప్రచారానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ముఖ్యంగా సువిధ యాప్ ద్వారా అవసరమైన అనుమతులు తీసుకోవాల్సి వుంటుంది. 48 గంటల ముందు యాప్ దార్వా దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తాం. ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఖర్చులన్నీ పార్టీల ఖాతాలో జమవుతాయి. పార్టీ అభ్యర్థుల ఖర్చుపై నిరంతర నిఘా ఉంటుంది. ప్రతీ విషయాన్ని నమోదు చేసుకుంటాం.

3 మోడల్ పోలింగ్ స్టేషన్లు

నియోజకవర్గంలో మూడు మోడల్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. మహిళల కోసం చేపల తిమ్మాపురంలో 205 నంబరు కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడ ఎక్కువ మంది మహిళ ఓటర్లు వుండడంతో మోడల్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. రుషికొండ వాడపాలెంలో బూత్ నంబర్ 348 యువత కోసం, మధురవాడ వికలాంగుల కాలనీలో దివ్యాంగుల కోసం 307 నంబర్ బూత్ ఏర్పాటు చేస్తున్నాం.

ఘనంగా చదురుపట్టు పునఃప్రారంభం



చదురుపట్టు వద్ద దాతలు, స్థానిక పెద్దలు

భీమునిపట్నం: భీమిలి గ్రామ దేవత శ్రీనూకాలమ్మ చదురుపట్టు బుధవారం ఘనంగా పునఃప్రారంభించారు. ఎగువపేట సమీపంలో అమ్మవారి ప్రధాన ఆలయం వుండగా... మెయిన్‌రోడ్డు బస్టాండ్ సమీపంలో ఒక గదిలో అమ్మవారి చదురుపట్టు ఉంది. ఏటా ఉత్సవాల సందర్భంగా తంగేడు పూలతో అలంకరించిన అమ్మవారి గరగను పెద్దబజారు, మెయిన్‌రోడ్డు, చిన్నబజారు ప్రాంతాల్లో ఊరేగిస్తారు. అనంతరం గరగను చదురు పట్టు వద్ద వుంచుతారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడకు తరలివచ్చి గరగను దర్శించుకుంటారు. అయితే ఈ గరగను వుంచే గది శిథిలావస్థకు చేరుకుని పాడైపోయింది. ఇటీవల దాని స్థానంలో కొత్త చదురుపట్టును దాతల సహకారంతో సుమారు రూ.8లక్షలతో నిర్మించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు, గుగ్గిళ్ల సాయి, గుగ్గిళ్ల గురునాథగుప్త, రేలంగి పెదబాబు, చౌదరి సత్యరాజు, వెంకటేష్, అడిదం కిశోర్, మైలిపల్లి షణ్ముఖరావు, గంటా నూకరాజు, కె.ముత్యాలరావు, తాతాజీ పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనకు శిక్షణ దోహదం



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న కళాశాల సిబ్బంది

ఆనందపురం : ఉద్యోగ అన్వేషణలో ఉన్నవారికి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగ పడతాయని నాంది ఫౌండేషన్ ప్రతినిధి డి.సౌమ్య అన్నారు. స్థానికంగా ఉన్న గాయత్రి డిగ్రీ కళాశాలలో బుధవారం మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్, నాంది ఫౌండేషన్ సంయుక్తంగా ఎంప్లాయిమెంట్ ఎడ్యుకేషన్ స్కిల్స్‌పై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యా నైపుణ్యాలతోపాటు ఇతర అంశాల్లోనూ ప్రతిభ కనబరిచిన వారికి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయన్నారు. కళాశాల డైరెక్టర్ బెల్లాన రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉద్యోగ సాధనకు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పీఎం పాలెం : ఓ వివాహిత అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. జీవీఎంసీ ఆరో వార్డులోని మధురవాడ సాయిరామ్ కాలనీ దుర్గాలమ్మ గుడి సమీపంలో షేక్ బీబీ టిఫిన్ కొట్టు నడుపుతున్నారు. ఆమె కుమారుడు షేక్ రెహ్మాన్ విదేశంలో ఉద్యోగం చేస్తుండగా, కోడలు షేక్ సమీరా బేగం (30) ఏడాది వయసున్న కుమారుడితో కలిసి ఉంటోంది. టిఫిన్ కొట్టు నడుపుతున్న షేక్ బీబీ ఈ నెల 26న ఉదయం 10 గంటలకు సామగ్రి కోసం మార్కెట్‌కు వెళ్లి ఇంటికొచ్చి చూసేసరికి కోడలు కనిపించలేదు. తెలిసిన వారిని విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు



పీఎం పాలెం హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కళానగర్‌లో కరపత్రం అందజేసి ఓటు అడుగుతున్న శ్రీనివాసరావు, తదితరులు

మధురవాడ : ప్రజలకు నిత్యం అందుబాటులో వుండడంతోపాటు ఇంటి వద్దే సంక్షేమ ఫలాలు అందాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బలపరచిన అభ్యర్థులు ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు కోరారు. ప్రజా విజయం కోసం అంతా ఫ్యాను గుర్తుపైనే ఓటు వేయాలని అభ్యర్థించారు. బుధవారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు కళానగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. వీరు కాలనీలో ప్రతీ ఇంటికీ వెళ్లి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాలు ద్వారా అమలు చేసిన పథకాలు, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు చేకూరి రజిని, పిళ్లా సూరిబాబు, కుడితి రామారావు, జగ్గుపిల్లి నరేష్, పిళ్లా అన్నమయ్య, పీవీజీ అప్పారావు, బెల్లాపు పాపారావు, పోతిన శేషుబాబు, ఎన్‌జీవోస్ కాలనీ పిళ్లా రమణ, అల్లాడ వెంకటరావు, జగ్గుపిల్లి సాయి, తమ్మినేని వరలక్ష్మి, వాసు, అచ్చియ్యపాత్రుడు, వి.రాంబాబు, మంగమ్మ, గుజ్జారి ఎల్లయ్యమ్మ, జగ్గుపల్లి లక్ష్మి, తోట వరలక్ష్మి, రమణ బోయిన కోటేశ్వరమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఇంటింటా ప్రచారం

పీఎం పాలెం : జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం సాయంత్రం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని కాలనీవాసులకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆరో వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, సీనియర్ నాయకులు గాదె రోశిరెడ్డి, పోతిన యర్రాజీ, వీవీ నరసింహారావు, సియ్యాద్రి కనక రాజు, గాయత్రినగర్ అప్పారావు, జామి శివ కుమార్, అనూష పాల్గొన్నారు.

తోలు తీస్తాననే వారికి ఓటడిగే హక్కు లేదు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మంగమారిపేటలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



నర్సింహనగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు

కొమ్మాది: గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు విశాఖ వచ్చినప్పుడు తమ సమస్యలు విన్నవించుకునేందుకు మత్స్యకారులు వెళ్తే తోలు తీస్తా, తొక్క తీస్తా అంటూ తక్కువ చేసి మాట్లాడారని... అలాంటి వారికి నేడు ఓటడిగే హక్కు లేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట, నర్సింహనగర్ ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా మంగమారిపేట గ్రామ దేవత ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మత్స్యకారులను గతంలో ఎన్నడూ పట్టించుకోలేదన్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మత్స్యకారులకు సముచిత స్థానం కల్పించారన్నారు. వేట విరామ భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచారని, మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ పెంచారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మత్స్యకారులు అంటే ప్రత్యేక అభిమానం అని తెలియజేశారు. గత ఐదేళ్లలో కనిపించని నాయకులు ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసం వస్తారని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరంలోని రుషికొండలో ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. రానున్న కాలంలో భీమిలి బీచ్ రోడ్డును ఆరు లైన్ల రహదారిగా విస్తరింపచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, పార్టీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, ముఖ్య నాయకులు ఎరుసు అప్పలకొండరెడ్డి, నల్ల బాబు, డి.అచ్చారావు, మేరుగు చిన్నారావు, నాగోతు సింగన్న, వాండ్రాసి సన్యాసిరావు, కోడిబోయిన రమణ, ఇల్లాపు వెంకట్రావు, బాడిదబోయిన రాములప్పడు, సాడి రమణ, హరి, జగన్నాథ శ్రీను, దూడ నర్సింగ్‌రావు, బొర రామకృష్ణ పాల్గొన్నారు.

బీటీ రహదారి నిర్మాణంలో కాంట్రాక్టర్ కక్కుర్తి



సుఖీభవ కాలనీ వద్ద బెర్మ్‌లో మట్టి అదృశ్యమైన దృశ్యం



దుర్గాలమ్మ గుడి వద్ద రహదారి పక్కన బెర్మ్‌లో మట్టి కొట్టుకుపోయిన దృశ్యం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ల కక్కుర్తి కారణంగా నాసిరకం పనులు జరుగుతున్నాయి. ఇటీవల చిట్టివలస, చిల్లపేట గ్రామాలను కలుపుతూ కిలో మీటరు పరిధిలో బీటీ రహదారిని రెండు విడతలుగా సుమారు రూ.కోటితో నిర్మించారు. నిర్మాణ సమయంలో లోపాలను కప్పిపుచ్చుకున్న కాంట్రాక్టర్లు చివరి దశలో కూడా తమ కక్కుర్తిని చాటుకున్నారు. రహదారిని ఆనుకుని ఇరువైపులా బెర్మ్‌లలో గ్రావెల్ వేయాల్సి వుంటుంది. రహదారిపై వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు... మరో వాహనం రోడ్డు పక్కకు వెళ్లినా... గ్రావెల్ గట్టిగా వుండడంతో రక్షణగా ఉంటుంది. కాంట్రాక్టర్లు గ్రావెల్‌కు బదులుగా సమీపంలోని చిట్టివలస చెరువు, వ్యవసాయ భూముల్లోని మట్టిని తీసుకొచ్చి బెర్మ్‌లలో పోశారు. ఈ మట్టి ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయి నిర్మాణంలోని లోపాలను వెలుగుచూశాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు కళ్లు తెరచి నిర్మాణంలో జరిగిన లోపాలను సరిదిద్దాలని చిట్టివలస, చిల్లపేట ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి




సమావేశంలో ఎన్నికల నిర్వహణ అధికారి భాస్కరరెడ్డి, నాయకులు

భీమునిపట్నం: ఎన్నికల సంఘం ప్రకటించిన నిబంధనలు అన్ని రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.భాస్కరరెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా పార్టీల నాయకులు సక్రమంగా ప్రచారం చేసుకోవాలని సూచించారు. ప్రత్యర్థి పార్టీలను రెచ్చగొట్టడం, వ్యక్తిగత విమర్శలు చేయకూడదన్నారు. కులం, మతం పేరుతో ప్రచారం, విమర్శలు తగవన్నారు. ముఖ్యంగా దేవాలయాలు, చర్చిలు, మసీదులు మొదలైన వాటిలో ప్రచారం చేయకూడదన్నారు. అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రచారానికి వినియోగించే వాహనాలు అన్నింటికీ అనుమతులు తీసుకోవాలన్నారు. సువిధ యాప్ ద్వారా అనుమతులు తీసుకోవాలని, లేకుంటే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. నాయకులు ముత్తంశెట్టి మహేష్, గంటా నూకరాజు, డీఏఎస్ రాజు, కంటుభుక్త రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఆది దంపతుల కల్యాణం



పార్వతీ పరమేశ్వరుల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో మహాదేవుడు

పీఎం పాలెం : కారుషెడ్ కూడలిలోని శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణం తిలకించారు. అంతకు ముందు ఆది దంపతుల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు. అనంతరం వేలాది మందికి భారీ అన్నసమారాధన చేశారు. రాష్ట్ర నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, పోతిన సూర్యారావు, నాయుడుబాబు పాల్గొన్నారు.

శేషతల్పంపై అప్పన్న



శేషతల్పంపై అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో తదితరులు



అప్పన్న ఉత్సవమూర్తులు

- పరవశించిన భక్తజనం
- వైభవంగా తిరువీధి
- జనసంద్రంగా మారిన సింహగిరి మాడ వీధులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహించిన సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా బుధవారం సాయంత్రం స్వామికి శేషతల్పంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను ముస్తాబు చేసి శేషతల్పంపై అధిష్ఠంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన పురోహిత్‌డు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యపై కేసు

పీఎం పాలెం : ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడగా పోలీసులకు తెలియజేయకుండా గుట్టుగా మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన ఉదంతంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఉదంతానికి సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ, సచివాలయం సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ ఆరో వార్డులోని సాయిరామ్ కాలనీలో గేదెల గౌరునాయుడు భార్య ధనలక్ష్మి(22)తో నివసిస్తున్నారు. గౌరునాయుడుకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందన్న విషయమై భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో ఈ నెల 24న సాయంత్రం మరోసారి గొడవ పడ్డారు. ఈ క్రమంలో 25న భర్తలేని సమయంలో ధనలక్ష్మి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మరణించిన సమాచారం బంధువులకు, పోలీసులకు తెలియపరచకుండా... మృతదేహాన్ని విజయనగరం జిల్లాలోని బుదరాయవలస పంచాయతీ పతివాడపేటకు అంబులెన్స్‌లో గౌరునాయుడు తీసుకెళ్లి అక్కడ అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ సంఘటనపై సాయిరామ్ కాలనీ సచివాలయ మహిళా పోలీస్ కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రామకృష్ణ తెలిపారు.